పేరుకే సేవా కేంద్రాలు!

- నామమాత్రంగా రైతు సేవాకేంద్రాలు..
- అందని రైతు భరోసా
- ధాన్యం కొనుగోలులోనూ దగా
- ఆందోళనలో అన్నదాత

పలాస:

గత వైఎస్సార్ కాంగ్రెస్ ప్రభుత్వం రైతుల సంక్షేమానికి అనేక పథకాలను అమలు చేసింది. రైతు భరోసా కేంద్రాలను ఏర్పాటు చేసి ఊర్లోనే రైతుకు కావాల్సిన సేవలను చేరువ చేసింది. ఒక్కమాటలో చెప్పాలంటే ఇంటివద్దకే ఎరువులు, విత్తనాలను సరఫరా చేసి రైతు ప్రభుత్వంగా పేరు తీసుకుంది. రైతులకు ఎనలేని సేవలందించిన ఆర్‌బీకేలు కూటమి ప్రభుత్వం హయాంలో వెలవెల బోతున్నాయని అన్నదాత ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత ఆర్‌బీకేలను రైతు సేవా కేంద్రాలుగా పేరు మార్చినప్పటికీ అందుకుతగ్గట్టుగా సేవలు మాత్రం అందడం లేదనే చెప్పాలి. పలాస మండలంలో మొత్తం 21 రైతు సేవా కేంద్రాలు ఉన్నాయి. వీటిలో రూరల్ పరిధిలో 16 ఉండగా.. పలాస-కాశీబుగ్గ మున్సిపాలిటీలో ఐదు ఉన్నాయి. గత వైఎస్సార్ కాంగ్రెస్ ప్రభుత్వంలో ఈ సమయానికి మూడు విడతలుగా రైతు భరోసా నిధులు విడుదలయ్యేవి. కేంద్ర ప్రభుత్వం మాత్రం ఎప్పటిలాగే ప్రతి విడతలో రూ. రెండు వేలు చొప్పున నిధులు విడుదల చేస్తూ వస్తోంది. ఇటీవల రైతులకు పీఎం కిసాన్ నిధులు రూ. రెండు వేలు చొప్పున రైతుల బ్యాంకు ఖాతాలో జమయ్యాయి. వాటితో కలిపి రాష్ట్ర ప్రభుత్వం కూడా నిధులు విడుదల చేస్తుందని రైతులు ఆశగా ఎదురు చూసినప్పటికీ నిరాశే మిగిలింది. ఎన్నికల ముందు ప్రతి ఏడాది రైతులకు రూ. 20 వేలు చొప్పున నిధులు విడుదల చేస్తామని చెప్పి ఓట్లు కోసం నమ్మించిన కూటమి నాయకులు అధికారంలోకి వచ్చి తొమ్మిది నెలలైనప్పటికీ ఒక్క పైసా కూడా ఇవ్వలేదు. దీంతో రైతులు ఆగ్రహంతో రగిలిపోతున్నారు. దీనికి తోడు రైతు సేవా కేంద్రాల ద్వారా కూడా ఎలాంటి సేవలు అందడం లేదు. వీటిని నిర్వీర్యం చేసేశారు. ధాన్యం కొనుగోలులో కూడా అవకతవకలు జరిగాయి. రైతు సేవా కేంద్రాల్లో రైతులు పేర్లు నమోదు చేసుకున్నప్పటికీ అక్కడ ధాన్యాన్ని కొనుగోలు చేయలేదు. రైతులు తప్పని పరిస్థితుల్లో తమ పొలాల నుంచి నేరుగా మిల్లర్లకు దళారుల ద్వారా అమ్ముకోవలసిన పరిస్థితి ఏర్పడింది. డబ్బులు కూడా సకాలంలో అందక ఎన్నో ఇబ్బందులు పడ్డారు.



బొడ్డపాడులోని రైతు సేవా కేంద్రం

ధాన్యాన్ని మిల్లర్లకే ఇచ్చాం



ఈ ఏడాది ధాన్యాన్ని నేరుగా మిల్లర్లకే అమ్ముకోవలసి వచ్చింది. రైతు సేవా కేంద్రాల వద్ద కొనుగోలు చేయలేదు. పొలంలో ధాన్యాన్ని కొంతమంది దళారుల ద్వారా కూడా అమ్ముకున్నారు. నేటికి కొంతమందికి ఇంకా డబ్బులు అందలేదు. గత ప్రభుత్వంలో ఈ పరిస్థితి లేదు.

– దువ్వాడ రవి, రైతు, అల్లుకోల, పలాస మండలం

భరోసా లేదు..



కూటమి ప్రభుత్వం ఏర్పడి తొమ్మిది నెలలు కావస్తున్నా నేటికి ఒక్క విడత కూడా రైతు భరోసా నిధులు రైతుల ఖాతాల్లో జమ కాలేదు. ఎన్నికల హామీలను తుంగలో తొక్కారు. గత ప్రభుత్వం విత్తనం నుంచి ఎరువు వరకు రైతు భరోసా కేంద్రాల ద్వారా సక్రమంగా అందజేసేది. ఇప్పుడు అటువంటివి ఏమీ కావడం లేదు. దిష్టి బొమ్మల్లా రైతు సేవా కేంద్రాలు దర్శనం ఇస్తున్నాయి.

– మద్దిల పాపారావు, రైతు, మామిడిపల్లి, పలాస మండలం

రిటైర్డు ఉపాధ్యాయుడుకి సత్కారం

కవిటి: బొరివంక జెడ్పీ ఉన్నత పాఠశాలలో వృత్తి విద్య ఉపాధ్యాయుడుగా నాలుగు దశాబ్దాలు పని చేసి ఉద్యోగ విరమణ చేసిన బల్లెడ శంకరరావు మాస్టారు సేవలు అమూల్యమైనవని ఎమ్మెల్సీ నర్తు రామారావు, కవిటి ఎంపీపీ కడియాల పద్మ, వైఎస్సార్‌సీపీ నాయకుడు ప్రకాష్ అన్నారు. హెచ్‌ఎం రామకృష్ణ అధ్యక్షతన శంకరరావు, శ్రావణి దంపతులను దుశ్శాలువలతో శుక్రవారం ఘనంగా సత్కరించి జ్ఞాపికలను అందజేశారు. ఆయన సేవలను కొనియాడారు. ఇండియా బుక్ ఆఫ్ రికార్డ్స్, వండర్ బుక్ ఆఫ్ రికార్డ్స్, తెలుగు బుక్ ఆఫ్ రికార్డ్స్ సంస్థల నుంచి అవార్డులను శంకరరావు అందుకున్నారని ఈ సందర్భంగా గుర్తు చేశారు. మాజీ ఎంపీపీ నర్తు చామంతి, గ్రామస్తులు శ్రీరాంప్రసాద్, డి.సతీష్, బి.విజయకృష్ణ, బి.లక్ష్మణమూర్తి, శ్రీపతి, ఉపాధ్యాయ సిబ్బంది పాల్గొన్నారు.



శంకరరావు దంపతులను సత్కరిస్తున్న ఎమ్మెల్సీ రామారావు తదితరులు

సమావేశాన్ని బహిష్కరించిన వార్డు సభ్యులు

టెక్కలి: టెక్కలి మేజర్ పంచాయతీ కార్యాలయంలో శుక్రవారం ఈవో జగన్నాథం నిర్వహించిన అత్యవసర సమావేశాన్ని పలువురు వార్డు సభ్యులు బహిష్కరించారు. పంచాయతీ పరిధిలో తమ ఆమోదం లేకుండా అడ్డగోలుగా వివిధ రకాల పనులు చేస్తున్నారని.. కనీసం తమకు సమాచారం ఇవ్వడం లేదంటూ ఆగ్రహం వ్యక్తం చేస్తూ సమావేశ మందిరం బయట బైఠాయించారు. అంతే కాకుండా తమ వార్డు పరిధిలో కొన్ని రకాల పనులు, సమస్యల పరిష్కారం విషయంలో కార్యాలయ సిబ్బంది నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారన్నారు. అలాగే 15వ ఆర్థిక సంఘం నిధులను ఎన్‌ఆర్‌ఈజీఎస్‌కు మళ్లిస్తూ నిబంధనలను తుంగలో తొక్కుతున్నారని వార్డు సభ్యులు దాడి ధర్మారావు, తోట లోకేశ్వరరావు, పీత రమణబాబు తదితరులు మండిపడ్డారు. తమకు తెలియకుండా పంచాయతీ పరిధిలో చేసిన పనులకు ఎటువంటి ఆమోదం ఇచ్చేది లేదని వారు స్పష్టం చేశారు. దీనిపై జిల్లా అధికారులతో పాటు పంచాయతీరాజ్ శాఖా మంత్రికి ఫిర్యాదు చేస్తామన్నారు. పంచాయతీ పరిధిలో అత్యవసర పనుల ఆమోదం కోసం సమావేశాన్ని నిర్వహించినట్లు ఈఓ జగన్నాథం వెల్లడించారు.



పంచాయతీ కార్యాలయం బయట బైఠాయించిన వార్డు సభ్యులు

పరిహారం ఇచ్చి ఆదుకోవాలని వినతి

టెక్కలి: తన భర్త బొమ్మాళి బాలరాజు టెక్కలి పంచాయతీ కార్యాలయంలో ఎలక్ట్రీషియన్‌గా పనిచేస్తూ విధి నిర్వాహణలో మృతి చెందాడని.. అతనికి అందాల్సిన ఐదు నెలల బకాయి వేతనంతో పాటు నష్ట పరిహారం ఇచ్చి కుటుంబాన్ని ఆదుకోవాలని సంతబొమ్మాళి మండలం చెట్లతాండ్ర పంచాయతీ గొల్ల సీతాపురం గ్రామానికి చెందిన బొమ్మాళి ధనలక్ష్మి కోరారు. ఈ మేరకు టెక్కలి పంచాయతీ ఈవో జగన్నాథాన్ని శుక్రవారం కలిసి వినతిపత్రాన్ని అందజేశారు. గత ఏడాది ఆగస్టు నెలలో విధి నిర్వాహణలో తన భర్త మృతి చెందాడని.. అప్పటి నుంచి కుటుంబ పోషణ కష్టంగా ఉందని ఆమె వాపోయారు. తన పోషణ కోసం కుటుంబ సభ్యుల్లో ఒకరికి ఉపాధి అవకాశం కల్పించాలని కోరారు. ఈ విషయాన్ని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువెళ్తానని ఈవో హామీ ఇచ్చారు.



ఈవో జగన్నాథానికి వినతిపత్రం అందజేస్తున్న ధనలక్ష్మి

4న పీసీఎంఏ ఎన్నికలు

- నామినేషన్ల పరిశీలన పూర్తి
- అధ్యక్ష బరిలో ఇద్దరు

కాశీబుగ్గ: పలాస క్యాష్యు మ్యానిఫేక్చరర్స్ అసోసియేషన్ (పీసీఎంఏ) ఎన్నికలకు సమయం సమీపిస్తోంది. ఈ నెల నాలుగో తేదీన ఎన్నికలు జరగనున్నాయి. ఇందులో భాగంగా ఫిబ్రవరి 25, 26, 27 తేదీల్లో నామినేషన్లను అసోసియేషన్ కార్యాలయంలో ఎన్నికల ప్రతినిధులు స్వీకరించారు. ఎనిమిది మంది నామినేషన్ వేశారని కమిటీ సభ్యులు చెప్పారు. అధ్యక్ష పదవికి మల్లా సురేష్, మల్లా శ్రీనివాసరావు పోటీపడుతుండగా కార్యదర్శి పదవి కోసం టంకాల రవిశంకరగుప్తా, కె.వి.శివక్రిష్ణ, కోశాధికారి కోసం చుండూరు మహేశ్వరరావు, సిందిరి సతీష్ కుమార్, మల్లా సంతోష్‌కుమార్లు నామినేషన్లు దాఖలు చేశారు. కాగా ఎన్నిక కమిటీ సభ్యులు బెల్లాల నారాయణరావు, తర్లాన రమేష్ కుమార్, మల్లా భాస్కరరావు తదితరుల సమక్షంలో నామినేషన్ల పరిశీలన శుక్రవారం జరిగింది. కాగా మల్లా సురేష్ 12 ఏళ్ల కార్యదర్శిగా, నాలుగేళ్ల అధ్యక్షులుగా పనిచేయగా, మల్లా శ్రీనివాసరావు 14 ఏళ్ల అధ్యక్షులుగా పనిచేసి ఉన్నారు. 188 మంది జీడి పరిశ్రమదారులు సభ్యులుగా ఉన్నారు.

ఫ్లైఓవర్ నిర్మాణానికి రూ.46 కోట్ల విడుదల

కాశీబుగ్గ: పలాస-కాశీబుగ్గ జంట పట్టణాలకు ప్రవేశద్వారంగా ఉన్న ఎల్‌సీగేటు పనులు పూర్తి చేయడానికి రూ.46.64 కోట్లు మంజూరైనట్లు కేంద్రమంత్రి కింజరాపు రామ్మోహననాయుడు, పలాస ఎమ్మెల్యే గౌతు శిరీషలు తమ కార్యాలయాల నుంచి శుక్రవారం ప్రకటనలు విడుదల చేశారు. మరికొద్ది రోజుల్లో ఫ్లైఓవర్ పనులు ప్రారంభమవుతాయన్నారు.

కృష్ణారెడ్డికి నివాళులు

ఇచ్ఛాపురం రూరల్: వైఎస్సార్‌సీపీ పటిష్టత కోసం రంగాల కృష్ణారెడ్డి ఎనలేని కృషి చేశారని వక్తలు అన్నారు. కృష్ణారెడ్డి ఇటీవల మృతి చెందిన నేపథ్యంలో అరకబద్రలో సంతాపసభను శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఇచ్ఛాపురం, కంచిలి మండలాల ఎంపీపీలు బోర పుష్ప, పైలా దేవదాసురెడ్డి, మున్సిపల్ చైర్ పర్సన్ పిలక రాజలక్ష్మీ, సీడాప్ మాజీ చైర్మన్ శ్యామ్‌ప్రసాద్‌రెడ్డి, పీఏసీఎస్ మాజీ అధ్యక్షుడు నర్తు నరేంద్రయాదవ్, రాష్ట్ర బీసీ సెల్ ఉపాధ్యక్షుడు నర్తు శివాజీ, ఎస్సీసెల్ రాష్ట్ర కార్యదర్శి సల్ల దేవరాజు, పలువురు సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు, పార్టీ నాయకులు పాల్గొన్నారు.

అబ్బుర పరిచిన సైన్స్ ప్రదర్శనలు

జాతీయ సైన్స్ దినోత్సవాన్ని ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలు, కళాశాలల్లో శుక్రవారం ఉత్సాహంగా నిర్వహించారు. ప్రఖ్యాత శాస్త్రవేత్త, నోబుల్ అవార్డు గ్రహీత సర్ సీవీ రామన్ చిత్రపటాలకు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా విద్యార్థుల సైన్స్ ప్రాజెక్టుల ప్రదర్శనలు అబ్బురపరిచాయి. సమాజానికి ఉపయోగపడే విధంగా.. వినూత్నమైన ఆలోచనలతో ప్రాజెక్టులను రూపకల్పన చేశారు. ఈ సందర్భంగా సైన్స్ ఉపాధ్యాయులను సత్కరించారు. సైన్స్‌పై నిర్వహించిన పోటీల్లో విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు.


–సాక్షి నెట్‌వర్క్



టెక్కలి: ఎంజేపీ ఏపీ బాలికల పాఠశాలలో సైన్స్ ప్రాజెక్టులను ప్రదర్శిస్తున్న విద్యార్థినులు



కంచిలి: బూరగాం ఉన్నత పాఠశాలలో సైన్స్ డే రంగవల్లిక



కవిటి: మాణిక్యపురంలో సైన్స్ టీచర్లను సత్కరిస్తున్న దృశ్యం



కాశీబుగ్గ: పలాస డిగ్రీ కళాశాలలో విద్యార్థులకు బహుమతి ప్రదానం



వజ్రపుకొత్తూరు రూరల్: పెదవంకలో విజ్ఞాన ప్రదర్శనను సందర్శించిన ఎంపీడీవో రమేష్ నాయుడు



ఇచ్ఛాపురం రూరల్: కె.శాసనాం హైస్కూల్లో సీవీ రామన్ చిత్రపటానికి పూలమాలలు వేస్తున్న ఎంపీపీ బోర పుష్ప

క్లుప్తంగా

డిగ్రీ విద్యార్థుల క్షేత్ర పర్యటన

టెక్కలి: టెక్కలి ప్రభుత్వ డిగ్రీ కళాశాలకు చెందిన వాణిజ్య విభాగం విద్యార్థులు శుక్రవారం మడపాం పేపర్ పరిశ్రమలో క్షేత్ర పర్యటన చేశారు. కాగితం తయారీ, మార్కెటింగ్ విధానాన్ని పరిశ్రమల యాజమాన్యం నుంచి తెలుసుకున్నారు. పర్యటనలో ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ వి.ల్యూక్‌పాల్, అధ్యాపకులు హేమరాజు, మల్లేశ్వరరావు, తేజోవతి పాల్గొన్నారు.

బోర్డు వెలసింది



గోడపై వెలసిన సమాచార హక్కు చట్టం బోర్డు

సాక్షి ఎఫెక్ట్...

ఇచ్ఛాపురం రూరల్: స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో సామాన్యులకు అందుబాటులో ఉండాల్సిన సమాచార హక్కు చట్టం-2005 బోర్డు లేదంటూ శుక్రవారం సాక్షి దినపత్రికలో 'సమాచారం ఎక్కడ?' శీర్షికన ప్రచురితమైన కథనానికి అధికారులు స్పందించారు. ఇటీవల కార్యాలయానికి మరమ్మతులు, సున్నాలు వేయడంతో పాత బోర్డు చెరిగి పోయిందంటూ ఎంపీడీవో కె.రామారావు తెలిపారు. శుక్రవారం కొత్త బోర్డును రాయించి, అందులో అధికారుల సమాచారం లిఖించారు.

చర్చ లేకుండానే మున్సిపల్ సమావేశం వాయిదా

ఇచ్ఛాపురం టౌన్: స్థానిక మున్సిపల్ కార్యాలయంలో కౌన్సిల్ సమావేశం చైర్‌పర్సన్ పిలక రాజలక్ష్మి అధ్యక్షతన శుక్రవారం జరిగింది. ఎమ్మెల్సీ ఎన్నికల కోడ్ అమల్లో ఉన్నందున ఎలాంటి చర్చ జరగకుండానే సమావేశాన్ని వాయిదా వేస్తున్నట్టు చైర్‌పర్సన్ ప్రకటించి ముగించారు.

60 బీరు బాటిళ్లతో వ్యక్తి అరెస్టు

ఇచ్ఛాపురం: ఒడిశాకి చెందిన 60 బీర్లను కారులో అక్రమంగా తరలిస్తుండగా సోంపేట మండలం కొర్లాం గ్రామానికి చెందిన వ్యక్తిని అరెస్టు చేసినట్టు ఎక్సైజ్ మొబైల్ పార్టీ సీఐ జి.వి.రమణ శుక్రవారం తెలిపారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు చెప్పారు.

మల్లన్నకు చక్రతీర్థ స్నానాలు

టెక్కలి: మహాశివరాత్రి ఉత్సవాల్లో భాగంగా టెక్కలి మండలం రావివలస ఎండల మల్లికార్జునస్వామి దేవస్థానంలో భక్తి శ్రద్ధలతో చక్ర తీర్థ స్నానాలు శుక్రవారం నిర్వహించారు. ఈవో జి.గురునాథరావు ఆధ్వర్యంలో భ్రమరాంబ సమేత మల్లన్న ఉత్సవ మూర్తులకు తిరువీధి ఊరేగింపు చేశారు.



ఆలయ వార్షికోత్సవం

వజ్రపుకొత్తూరు మండలం డోకులపాడులో అభయంజనేయస్వామి ఆలయ వార్షికోత్సవాన్ని శుక్రవారం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. పండితులు మంత్రోచ్ఛరణ నడుమ ప్రత్యేక పూజలు చేశారు. అధికసంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

–వజ్రపుకొత్తూరు రూరల్



లోక్‌అదాలత్‌పై సమీక్ష

టెక్కలి కోర్టు సముదాయం పరిధిలో ఈ నెల ఎనిమిదో తేదీన జరగనున్న జాతీయ లోక్ అదాలత్‌లో అత్యధికంగా కేసులు రాజీ చేసే విధంగా న్యాయవాదులు సహకరించాలని సీనియర్ సివిల్ జడ్జి (ఎఫ్‌ఏసీ) జె.శ్రీనివాసరావు కోరారు. కోర్టు సముదాయంలో బార్ అసోసియేషన్ సభ్యులతో శుక్రవారం సమావేశం నిర్వహించి లోక్ అదాలత్‌పై సమీక్షించారు. రాజీ వలన కలిగే ప్రయోజనాలపై కక్షిదారులకు అవగాహన కల్పించాలన్నారు. అసోసియేషన్ అధ్యక్షుడు డి.వి.వివేకానంద, పలువురు న్యాయవాదులు పాల్గొన్నారు.

–టెక్కలి



పాఠశాల వార్షికోత్సవం

పదో తరగతి విద్యార్థుల విజయానికి తొలిమెట్టని హెచ్‌ఎంలు శివరాంప్రసాద్‌పాఢి, జి.శాంతి అన్నారు. కవిటి మండలంలోని రాజపురం బాలుర ఉన్నత పాఠశాల, ముత్యాలపేట జెడ్పీ ఉన్నత పాఠశాలలో వార్షికోత్సవాన్ని శుక్రవారం ఘనంగా నిర్వహించారు. పబ్లిక్ పరీక్షలకు సన్నద్ధమవుతున్న బాలబాలికలకు విజయావకాశాలపై వక్తలు దిశానిర్దేశం చేశారు. ఈ సందర్భంగా విద్యార్థుల సాంస్కృతిక ప్రదర్శనలు అలరించాయి.

–కవిటి

అందరినీ విస్మరించారు..

రాష్ట్ర అసెంబ్లీలో శుక్రవారం ప్రవేశపెట్టిన 2025–26 ఆర్థిక సంవత్సరం బడ్జెట్‌పై అన్ని వర్గాల ప్రజలు అసంతృప్తి వ్యక్తం చేశారు. వ్యవసాయం, విద్య, వైద్య రంగాలకు సరైన కేటాయింపుల్లేవని, మహిళలను పూర్తిగా విస్మరించారని మండిపడ్డారు. కూటమి ప్రభుత్వ సూపర్‌సిక్స్ హామీలను విస్మరించారనే అభిప్రాయం వ్యక్తమైంది.

–సాక్షి నెట్‌వర్క్

వ్యవ'సాయాన్ని' పక్కనపెట్టారు..



వ్యవసాయశాఖ మంత్రి అచ్చెన్నాయుడుకు ఆ రంగంపై అవగాహన లేదు. అందుకే బడ్జెట్‌లో సరైన నిధుల కేటాయింపుల్లేవు. అన్నదాత సుఖీభవ పథకానికి రూ. 10,706 కోట్లు అవసరమైతే.. తూతూ మంత్రంగా రూ. 6,300 కోట్లతో చేతులు దులుపుకున్నారు. వ్యవసాయం అనుబంధ బడ్జెట్ కేటాయింపుల్లో పూర్తిగా మొండి చేయి చూపారు. మంత్రి అచ్చెన్నాయుడు సొంత నియోజకవర్గంలోని ఆఫ్‌షోర్‌ను పూర్తి చేసే బాధ్యత లేదని తేటతెల్లమైంది. వంశధార ఆధునికీకరణ వైపు దృష్టి సారించలేదు. ఇప్పుడు ప్రకటించిన బడ్జెట్ కేవలం గ్రాఫిక్స్ మాత్రమే.

–పేరాడ తిలక్, వైఎస్సార్‌సీపీ టెక్కలి నియోజకవర్గ ఇన్‌చార్జి

మహిళలను మోసగించారు



కూటమి ప్రభుత్వం మరోసారి మహిళల్ని మోసం చేసింది. ఆడబిడ్డల నిధి, మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం హామీలపై కనీసం ప్రస్తావన చేయలేదు. తల్లికి వందనం పథకం కేటాయింపుల్లో భారీగా కోత విధించారు. సూపర్‌సిక్స్‌లో మహిళాశక్తి అన్నప్పటికీ బడ్జెట్‌లో కనిపించలేదు. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో ప్రతీ సంక్షేమ పథకాల విషయంలో మహిళలకు ఎంతో ప్రాధాన్యత ఇచ్చారు. కూటమి ప్రభుత్వంలో మహిళా సాధికారతపై నిర్లక్ష్యంగా ఉన్నారనే విషయానికి ఈ బడ్జెట్ నిదర్శనంగా చెప్పవచ్చు.

–గొండు చాందిని, వైఎస్సార్‌సీపీ టెక్కలి నియోజకవర్గం మహిళా విభాగం అధ్యక్షురాలు

మరోసారి మోసం..



కూటమి ప్రభుత్వం ప్రకటించిన బడ్జెట్‌లో కేటాయింపులు గమనిస్తే ప్రజలను మరోసారి మోసం చేశారనే విషయం అర్థమవుతోంది. నిరుద్యోగ భృతి హామీని నీరుగార్చేశారు. తల్లికి వందనం పథకానికి సుమారు రూ. 12,450 కోట్లు అవసరం కాగా ఆ దిశగా కేటాయింపు చేయలేదు. నిరుద్యోగ యువత, మహిళలు, రైతులతో పాటు అన్ని వర్గాలకు మొండి చేయి చూపారు. సూపర్ సిక్స్ హామీలను సైతం విస్మరించారు.

–సింగుపురం మోహనరావు,న్యాయవాది, టెక్కలి

నిరుద్యోగ భృతి ఎక్కడ?



బడ్జెట్‌లో నిరుద్యోగ భృతిపై ప్రస్తావన లేదు. ఎన్నికల హామీల్లో ఏ ఒక్కదానికి సరైన కేటాయింపులు చేయలేదు. ఉచిత బస్సు ప్రయాణానికి సంబంధించి నిధులు కేటాయించకుండా మహిళలకు మోసగించారు.

– శిష్టు గోపి, వైఎస్సార్‌సీపీ పట్టణ అధ్యక్షులు, పలాస-కాశీబుగ్గ మున్సిపాలిటీ

అన్నదాతకు నిధుల్లేవు..



వ్యవసాయ రంగాన్ని పూర్తిగా విస్మరించారు. ఆ శాఖ మంత్రి అచ్చెన్నాయుడు అవగాహన లోపంతో బడ్జెట్‌ను రూపకల్పన చేశారు. సూపర్ సిక్స్ హామీల్లో భాగంగా అన్నదాత సుఖీభవ పథకానికి పూర్తిస్థాయిలో నిధులు కేటాంచలేదు. మంత్రి సొంత జిల్లాలో సాగునీటి ప్రాజెక్టుల ప్రస్తావన లేదు. కేవలం అంకెల గారడీగా బడ్జెట్‌ను ప్రవేశపెట్టారు.

–ఎస్.హేమసుందర్‌రాజు, వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు, కోటబొమ్మాళి

పసలేని బడ్జెట్



తొలిసారిగా కూటమి ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో పసలేకుండా పోయింది. కేవలం అంకెలు గారడీ మాత్రమే అని స్పష్టంగా తెలుస్తోంది. మహిళలకు పెద్దపీట వేస్తున్నాం అంటూ చెప్పిన ప్రభుత్వం బడ్జెట్‌లో మాత్రం ఉచిత బస్సు, నిరుద్యోగ భృతి పథకాలపై వేటు వేసింది. ఒక్కమాటలో చెప్పాలంటే సూపర్ సిక్స్ పథకాలు పేరుతో రాష్ట్ర ప్రజలకు పంగనామాలు పెట్టినట్లే.

– బోర పుష్ప, ఎంపీపీ, ఇచ్ఛాపురం మండలం

ప్రత్యేక కేటాయింపుల్లేవు



అసెంబ్లీ సాక్షిగా రాష్ట్ర ప్రజలను సీఎం చంద్రబాబు మోసం చేశారు. మహిళలకు ఉచిత బస్ సౌకర్యం, 18 ఏళ్లు దాటిన మహిళలకు నెలకు రూ.1500 ఆర్థిక సాయం, నిరుద్యోగ భృతి, బీసీలకు 50 ఏళ్లకే పింఛన్ పథకాలకు ఎలాంటి కేటాయింపులు చేయలేదు. అన్నదాత సుఖీభవ, తల్లికి వందనం పథకాలకు అరకొర కేటాయింపులు చేసి చేతులు దులుపుకున్నారు.

–నడుపూరు శ్రీరామమూర్తి, ఎంపీపీ, నందిగాం

విద్యా రంగానికి ప్రాధాన్యం లేదు



విద్యా రంగానికి తగిన ప్రాధాన్యత కల్పించలేదు. ఉద్యోగ, ఉపాధ్యాయ పెన్షనర్లకు సంబంధించి పెండింగ్ బకాయిలపై ప్రస్తావన లేదు. 12వ పీఆర్‌సీ, మధ్యంతర భృతి, సీపీఎస్ ఉద్యోగులకు డీఏ, పీఎఫ్ తదితర వాటిపై కనీసం ప్రస్తావన చేయకపోవడం ఉపాధ్యాయ, ఉద్యోగులకు నిరాశ కల్పించారు. విద్యా రంగాన్ని పటిష్టం చేసే సరైన ఆలోచనలు చేయలేదు. బడ్జెట్‌పై పునరాలోచన చేయాలి.

–జి.ప్రసాదరావు, ఉపాధ్యాయ సంఘ నాయకుడు, టెక్కలి.

అగ్ని ప్రమాదాల నివారణపై అవగాహన

టెక్కలి: అగ్ని ప్రమాదాలు సంభవించే సమయంలో వాటిని ఏ విధంగా నిరోధించాలి అనే దానిపై విద్యార్థులకు అవగాహన ఉండాలని సన్‌రైజ్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఫైర్ అండ్ సేఫ్టీ ట్రైనర్ జి.భాస్కర్ సూచించారు. శుక్రవారం టెక్కలి ఆదిత్య ఇంజినీరింగ్ కళాశాలలో మెకానికల్, ట్రిపుల్ ఈ విద్యార్థులకు అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. కంపెనీల్లో, విద్యుత్ కేంద్రాల్లో అగ్ని ప్రమాదాలు, షార్ట్ సర్క్యూట్ సంభవించే సమయంలో తీసుకోవాల్సిన చర్యలపై అవగాహన కల్పించారు. కళాశాల డైరెక్టర్ వి.వి.నాగేశ్వరరావు, ప్రిన్సిపాల్ ఎ.ఎస్.శ్రీనివాసరావు, ఎన్ఎస్ఎస్ పీఓ ఎస్.వి.మారుతి ప్రసాద్, కోఆర్డినేటర్లు లోకనాథం, జగదీశ్వరరావు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి కబడ్డీ పోటీలకు సర్వం సిద్ధం

పలాస: బొడ్డపాడులోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల క్రీడా మైదానంలో శనివారం జరగనున్న రాష్ట్రస్థాయి కబడ్డీ పోటీలకు ఏర్పాట్లు పూర్తి చేసినట్టు యువజన సంఘం అధ్యక్షుడు తామాడ క్రాంతి తెలిపారు. బొడ్డపాడు క్రీడా మైదానంలో శుక్రవారం ఏర్పాటు చేసి విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. యువజన సంఘం 1954లో ఏర్పాటైందని.. శనివారం 71వ వార్షికోత్సవాన్ని జరుపుకుంటున్న సందర్భంగా రాష్ట్రస్థాయి కబడ్డీ పోటీలను నిర్వహిస్తున్నట్టు వివరించారు. జైభీమ్ యువజన సంఘం అధ్యక్షుడు కిక్కర డిల్లీరావు పాల్గొన్నారు.

మత్స్యకారుల నిరసన

కవిటి: తమను మండల మత్స్యకార రైతు ఉత్పత్తిదారుల సమాఖ్య, మండల మహిళాసమాఖ్య అధికారులు మోసం చేశారంటూ సీహెచ్ కపాసుకుద్ది మత్స్యకారులు ఆవేదన వ్యక్తం చేశారు. వద్దన్నా ఎండి చేపల యూనిట్ల ఏర్పాటు పేరుతో రుణాలు ఇచ్చారని.. ఇప్పుడు చెల్లించాలని నోటీసులు పంపడాన్ని వ్యతిరేకిస్తూ కవిటి లోని మండల మహిళా సమాఖ్య కార్యాలయం ఎదుట శుక్రవారం నిరసన తెలియజేశారు.